అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల ముఠా అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఏసీపీ రెహమాన్

సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రెహమాన్

వైరాటౌన్, ఫిబ్రవరి 6 : వాహన తనిఖీల్లో భాగంగా చింతకాని మండలం జగన్నాథపురం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ రెహమాన్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జూలురుపాడు మండలం పాపకొల్లుకు చెందిన వృద్ధ దంపతులు వాంకుడోతు కేతానాయక్, బాలి ఈ నెల 2న వైరాలోని కంటి ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకొని తిరిగి ఇంటికి వెళ్లేందుకు వైరా బస్టాండ్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో వారిని అనుసరిస్తూ.. మాటలు కలిపిన కొందరు అగంతకులు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. తాము జూలూరుపాడు వెళ్లాలని చెప్పగా.. కొత్తగూడెం వైపు వెళ్తున్నామని, చార్జీ లేకుండా తీసుకెళతామని చెప్పి సుమోలో ఎక్కించుకున్నారు. కొంతదూరం వెళ్లిన తర్వాత సుమోలో అంతకుముందే ఉన్న ఐదుగురు అగంతకులు బొమ్మ బొరుసు ఆట ప్రారంభించారు. కారులో ఓ అగంతకుడు.. వృద్ధుడు కేతానాయక్‌ను రూ.50 బదులు ఇవ్వాలని, తిరిగి ఇస్తానని అడిగి తీసుకున్నాడు. వెంటనే ఆట వేసి మీ రూ.50లకు రూ.100 వచ్చాయని చెప్పి కేతానాయక్‌కు ఆ నగదు ఇచ్చాడు. దీనిని ఎరగా చూపి వృద్ధుడి వద్ద నుంచి రూ.5వేలు తీసుకొని ఆటలో పోయాయని చెప్పి.. తర్వాత వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసుపై కన్నేసి గొలుసు పెట్టి ఆడితే రూ.లక్ష వస్తుందని నమ్మించారు. దీంతో తన మెడలోని బంగారు గొలుసును బాలి తీసి ఇచ్చింది. ఆ తర్వాత ఆటలో గొలుసు కూడా పోయిందని నమ్మబలికారు. వెంటనే కారులోని ఒక వ్యక్తి ఆ డబ్బులు, 3 తులాల బంగారు నానుతాడు తీసుకొని తల్లాడ శివారులో దిగిపోయాడు. తల్లాడ దాటిన తర్వాత వృద్ధ దంపతులు అగంతకులతో గొడవపడ్డారు. దీంతో కారులో మిగిలిన అగంతకులు ఆ వృద్ధ దంపతులను తల్లాడలోని ఏన్కూరు రోడ్డులో కారు లోంచి బయటకు నెట్టి పరారయ్యారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన వృద్ధ దంపతులు వైరా, తల్లాడ పోలీసులను ఆశ్రయించారు. అయితే వాహన తనిఖీల్లో భాగంగా ఏపీకి చెందిన వారిని అదుపులో తీసుకొని విచారణ చేపట్టగా.. సాతులూరుకు నాదెండ్ల మండలం పల్నాడు జిల్లాకు చెందిన ఆరుగురు ఒక ముఠాగా ఏర్పడి ఏపీలో పలుచోట్ల దొంగతనాలు చేస్తున్నారు. అక్కడి నుంచి తెలంగాణలో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకుని వృద్ధ దంపతులను మోసం చేశారు. నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 3 తులాల బంగారు నానుతాడు, రెండు సెల్‌ఫోన్లు, టాటా సుమో వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ వివరించారు. సమావేశంలో సీఐ సాగర్, తల్లాడ, వైరా ఎస్సైలు కొండలరావు, మేడా ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ పాం రైతులను ఆదుకోవాలి

ఎంపీ నామా నాగేశ్వరరావు

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 6: దేశీయంగా ఆయిల్ పాం రైతులను ఆదుకోవాలని, వారి సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. గిట్టుబాటు ధర కల్పించడం, సీపీవో (క్రూడ్ పామ్ ఆయిల్)పై దిగుమతి సుంకాలు విధించడం ద్వారా దేశీయ రైతులను ఆదుకోవచ్చని సూచించారు.

సమర్థంగా విధులు నిర్వర్తించాలి : కలెక్టర్

మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 6 : గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు సమర్థంగా విధులు నిర్వర్తిస్తూ.. ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. మంగళవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రత్యేకాధికారులకు గ్రామ పంచాయతీ విధులు, నూతన పంచాయతీరాజ్ చట్టం తదితర అంశాలపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిందని, తిరిగి పంచాయతీ ఎన్నికలు నిర్వహించే వరకు ప్రత్యేకాధికారులతో పాలన సాగించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రత్యేకాధికారులు నూతన పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన పెంచుకొని విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. పంచాయతీ నిధుల వినియోగం, బిల్లుల చెల్లింపు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. బుధవారం నుంచి ఈ నెల 15 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. 15న ప్రత్యేక గ్రామసభ చేపట్టి, పారిశుధ్య కార్మికులను సన్మానించాలని, ఇందులో యువతను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జడ్పీ సీఈవో అప్పారావు, డీపీవో హరికిషన్, డీఆర్డీవో విద్యాచందన, డీఎల్‌పీవోలు ప్రభాకర్‌రావు, పుల్లారావు, గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

మెడికల్ ఇన్‌వాలిడేషన్ కేసుల పరిశీలన

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 6: మెడికల్ ఇన్‌వాలిడేషన్ కేసులను కలెక్టర్ వీపీ గౌతమ్ మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో పరిశీలించారు. వైద్య, రెవెన్యూ శాఖల నుంచి రెండు చొప్పున దరఖాస్తులను పరిశీలించి, వైద్యాధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ రాములు నాయక్, డీసీహెచ్ఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో అరుణ, మెడికల్ బోర్డ్ వైద్యాధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలించిన కలెక్టర్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 6: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించారు. సెగ్మెంట్లవారీగా రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ రూముల ఏర్పాటుపై అధికారులకు సూచనలు చేశారు. భద్రతా పరంగా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి సుమ, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ అండ్ బీ ఏఈఈ విశ్వనాథ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

సత్తుపల్లి, ఫిబ్రవరి 6: 18 సంవత్సరాల లోపు పిల్లలు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంవీఐ వెంకటపుల్లయ్య హెచ్చరించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఎంవీఐ మాట్లాడుతూ రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ వాహనం నడిపేటప్పుడు రోడ్డు నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించడంతో పాటు వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. సమావేశంలో హెచ్ఎం యాకూబ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఎస్ఎస్ఆర్ రివిజన్ చేపట్టాలి

మామిళ్లగూడెం,ఫిబ్రవరి 6: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపడుతున్న స్పెషల్ సమ్మరి రివిజన్-2024 ప్రక్రియ సజావుగా చేపట్టాలని జిల్లా ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు, చీఫ్ రేషనింగ్ అధికారిణి బాలమాయదేవి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రిటర్నింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఐదు నియోజవర్గాల దరఖాస్తులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవోలు గణేశ్, అశోక్‌చక్రవర్తి, ఏస్‌డీసీ రాజేశ్వరి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు రాంబాబు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

బోనకల్లు, ఫిబ్రవరి 6: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో ఖమ్మంలోని మీనాక్షి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో వంద మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్. శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ.. వంద మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, 25 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ పరశురాం, కందులు పాపారావు, రాములు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించాలి

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 6: తల్లిదండ్రులు తమ పిల్లలకు నులిపురుగుల నివారణ మందు ఇప్పించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని జిల్లా వ్యాక్సినేషన్ అధికారి సీహెచ్ వెంకటరమణ అన్నారు. ఈనెల 12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ పిల్లలందరికి నులిపురుగుల నివారణ మందు పంపిణీ చేస్తామన్నారు. 1 నుంచి 19 సంవత్సరాల వయసు వారు అందరు తీసుకోవాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన మాట్లాడుతూ అంగన్‌వాడీ, పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, బడిబయట పిల్లలు, వలస కుటుంబాలలో ఉన్న పిల్లల్ని గుర్తించి వారికి నులిపురుగుల నివారణ మందు వేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (ఐబీ), అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఐబీ), జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పాల్గొన్నారు.

రోడ్డుకు దూరంలో వ్యాపారాలు నిర్వహించుకోవాలి

కల్లూరు, ఫిబ్రవరి 6: వీధి వ్యాపారులు ప్రధాన రహదారికి 10 అడుగుల దూరంలో వ్యాపారాలు చేసుకోవాలని సీఐ వెంకటేశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం కల్లూరు ప్రధాన సెంటర్‌లో వీధి వ్యాపారులతో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. చిరు వ్యాపారులు రోడ్డుకు దగ్గరగా, ఫుట్‌పాత్‌ల వద్ద వ్యాపారాలు చేస్తే వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. సదస్సులో ఎస్సై షాకీర్, ఈవో కృష్ణారావు, చిరువ్యాపారులు పాల్గొన్నారు.

బెస్ట్ ఆశావర్కర్‌కు సన్మానం

సత్తుపల్లి రూరల్, ఫిబ్రవరి 6: మండలంలోని గంగారం పీహెచ్‌సీలో పనిచేస్తున్న బెస్ట్ ఆశావర్కర్ కంచె రాజేశ్వరిని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. ఆశా వర్కర్‌గా రాజేశ్వరి ప్రతిభను గుర్తించి అవార్డు అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ, తడికమళ్ల యోబు, సెకండ్ ఏఎన్ఎంలు కృష్ణవేణి, సుమలత, మాధవి, రమాదేవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్ సమావేశానికి వెళ్లిన జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు

మధిర, ఫిబ్రవరి 6: తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి మధిర నుంచి జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు హాజరయ్యారు. ఈ నెల 13న నల్గొండలో భారీ బహిరంగ సభను సీఎం కేసీఆర్ ప్రకటించారని, కృష్ణా జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతగా వ్యవహరించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి రావూరి శ్రీనివాసరావు, మంకెన రమేష్, పంబి సాంబశివరావు, పెంట్యాల పుల్లయ్య, గడ్డం శ్రీనివాసరావు, గుజ్రాల హనుమంతరావు, తాతా ప్రసాద్, పూనుగోటి వెంకటరత్నాకర్, పిన్నిల్లి శ్రీను, సామినేని అప్పారావు, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

తమ్మినేనిని పరామర్శించిన సీపీఎం నాయకులు

ఖమ్మం రూరల్, పిబ్రవరి 6: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రాన్ని ఆ పార్టీ మండల నాయకులు మంగళవారం పరామర్శించారు. ఇటీవల తీవ్ర ఆనారోగ్యానికి గురై హైదరబాద్‌లో చికిత్స తీసుకొని స్వగ్రామం తెల్దారుపల్లికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు తమ్మినేనిని పరామర్శించారు. పార్టీ నాయకుడు నందిగామ కృష్ణ ఏటుకూరి ప్రసాద్‌తో పాట పలువురు నాయకులు స్వయంగా తెల్దారుపల్లి వెళ్లి ఆయనను పరామర్శించారు. నాయకులు మోరబోయిన పుల్లయ్య, ఆంటోని తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు వివరాలు నమోదు చేసుకోవాలి

మధిర, ఫిబ్రవరి 6: గృహ విద్యుత్‌కు సంబంధించిన వినియోగదారుడి విద్యుత్ సర్వీస్ నెంబర్లకు ఆధార్, రేషన్‌కార్డు నంబర్లను అనుసంధానం చేయాలని విద్యుత్‌శాఖ వైరా డివిజన్ డీఈ ఎన్.కృష్ణ తెలిపారు. మంగళవారం మధిర విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో మధిర, ఎర్రుపాలెం మండలాల మీటర్ రీడర్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. విద్యుత్ మీటర్ రీడర్స్ వివరాలు సేకరించే విషయంలో నిర్లక్ష్యం వహించకుండా వినియోగదారుడికి ఈ పథకాన్ని వర్తింప చేసేలా చూడాలన్నారు. శిక్షణలో మధిర సబ్ డివిజన్ ఏడీఈ ఎం.అనురాధ, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ ఎం.శివానీ, మధిర పట్టణ విద్యుత్ ఏఈ ఎస్.అనిల్ కుమార్, రూరల్ ఏఈ కే.నాగేశ్వరరావు, సబ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్లో వాహనాల వేలం

కారేపల్లి, ఫిబ్రవరి 6: మండలంలోని కారేపల్లి క్రాస్‌రోడ్‌లో గల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేసినట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫీకర్‌అహ్మద్ తెలిపారు. జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేణుగోపాలరెడ్డి పర్యవేక్షణలో తొమ్మిది మోటార్ సైకిళ్లకు వేలం నిర్వహించగా రూ.3.30లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై వసంతలక్ష్మి, హెడ్‌కానిస్టేబుల్ పార్థసారథి, కానిస్టేబుళ్లు విజయ్, వెంకటేశ్వర్లు, రాణా, మధార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీలో పాలెం విద్యార్థి సత్తా

రఘునాథపాలెం, ఫిబ్రవరి 6 : మండల కేంద్రం రఘునాథపాలేనికి చెందిన 9వ తరగతి విద్యార్థి జాతీయస్థాయి ఆర్చరీలో సత్తాచాటాడు. వీవీసీ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న మద్దిన్ని ప్రణయ్‌కుమార్ ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు పూణేలో జరిగిన 14వ నేషనల్ ఫీల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-17 విభాగంలో బ్రాంజ్‌మెడల్ సొంతం చేసుకున్నాడు. అంతేకాక సీనియర్‌మెన్స్ విభాగంలో 4వ స్థానంలో నిలిచాడు. ప్రణయ్‌కుమార్‌ను రఘునాథపాలెం సహకార సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, నల్లమోతు శ్రీనివాసరావు మంగళవారం అభినందించారు.

మట్టి తోలకాలపై ఆరోపణలు నిజం కాదు

కూసుమంచి, ఫిబ్రవరి 6: మండలంలోని జీళ్లచెరువులోని ఆలయ భూములు, చెరువులో మట్టి తోలకాల్లో పాలక మండలిపై వచ్చిన ఆరోపణలు నిజం కాదని సీతారామచంద్రస్వామి పాలక మండలి సభ్యులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు దాని ప్రతిని విలేకరులకు అందజేశారు. జాతీయ రహదారికి మట్టి కోసం సంప్రదించగా మైనింగ్ నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లించి మట్టిని తోలుకున్నారని స్పష్టం చేశారు. పాలక మండలిపై ఆరోపణలు సరైనవి కావని చైర్మన్ చెన్నా వెంకన్న, సభ్యులు రామకృష్ణ, అంజయ్య, నాగేశ్వరరావు, నాగమణి, బక్కయ్య తదితరులు తెలిపారు.

మీటర్ రీడింగ్ నమోదులో ట్రాన్స్‌కో ఉద్యోగులు

సత్తుపల్లి, ఫిబ్రవరి 6: ట్రాన్స్‌కో డీఈ రాములు పర్యవేక్షణలో 200 యూనిట్ల ఉచిత కరెంటు నిమిత్తం పట్టణంలోని ప్రతి ఇంటికి ట్రాన్స్‌కో అధికారులు వెళ్లి మంగళవారం మీటర్ రీడింగ్ నమోదును చేపట్టారు. మీటర్ రీడింగ్‌కు వచ్చిన బిల్లర్లకు రేషన్‌కార్డు, ఆధార్ నెంబరును ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రసాద్, శరత్‌బాబు, అంకారావు, సుజాత, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి కుర్చీలు వితరణ

కొణిజర్ల, ఫిబ్రవరి 6: కొణిజర్ల పీహెచ్‌సీకి పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ద్వారా పరిశ పుల్లయ్య ఆధ్వర్యంలో వారి సతీమణి పేరు మీద మంగళవారం 25 కుర్చీలను అందజేశారు. అనంతరం ట్రస్టుకు సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాధాకృష్ణ, సిబ్బంది దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె

వైరాటౌన్, ఫిబ్రవరి 6: ఈ నెల 16న జరిగే కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్ దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగిన రైతు కార్మిక సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు పూర్తయిన రైతాంగ, కార్మిక ప్రజా సమస్యలను పరిష్కరించలేదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేశ్, నాయకులు కే అర్జున్‌రావు, తోట నాగేశ్వరరావు, అనుమోలు రామారావు, షేక్ జమాల్, వెల్లదండి బాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, లావుడ్యా రాములునాయక్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 6 : మండల కేంద్రం రఘునాథపాలెంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులు ఈ నెల 12వ తేదీన జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9848161319 ఫోన్‌నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వెంకటేశ్వరరావు

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 6 : ఖమ్మం మొదటి అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కొత్త వెంకటేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన్ని విధుల నుంచి తొలగిస్తూ తెలంగాణ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో వెంకటేశ్వరరావు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. రిట్ పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు ఆ ఉత్తర్వులపై స్టే ఆర్డర్ జారీ చేసింది. దీంతో అదనపు పబ్లిక్ ప్రాసీక్యూటర్‌గా మళ్లీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తంచేశారు.

మందుబాబులకు జరిమానా

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 6 : నగరంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన 65 మందికి సెకండ్‌క్లాస్ స్పెషల్ మేజిస్ట్రేట్ రూ.200 నుంచి 1000 వరకు జరిమానాలు విధించారని ఖమ్మంటౌన్ ఏసీపీ హరికృష్ణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. నగరంలో రాత్రి 11గంటలలోపు కచ్చితంగా దుకాణాలను మూసివేయాలని లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎన్‌సీసీ కేడెట్‌కు అభినందన

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6 : నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి వీ సాగర్ ఎన్‌సీసీ కేడెట్‌గా జనవరి 26న ఢిల్లీలో నిర్వహించిన రిపబ్లికేడ్ పరేడ్‌లో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ జర్పుల రమేశ్ మంగళవారం అభినందించారు.

చెల్లని చెక్కు కేసులో 6నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 6 : చెల్లని చెక్కు కేసులో ఖమ్మం నగరానికి చెందిన నిందితుడు ఆవుల మోహన్‌రెడ్డికి 6నెలల జైలుశిక్షతోపాటు రూ.20 లక్షల నష్టపరిహారం ఫిర్యాదుదారుడికి చెల్లించాలని ఖమ్మం మొదటి అదనపు శ్రేణి న్యాయస్థాన న్యాయాధికారి మంగళవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది తరపున న్యాయవాదిగా ఆనం చిన్ని రామారావు వ్యవహరించారు.

గృహజ్యోతి పథకానికి వివరాలు అందించాలి

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 6: గృహజ్యోతి పథకంలో లబ్ధి పొందేందుకు విద్యుత్ వినియోగదారులు వివరాలు అందించాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా పొందేందుకు ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారు విద్యుత్ సిబ్బంది పరిశీలనకు వచ్చినప్పుడు వినియోగదారుల వివరాలు అందించాలని పేర్కొన్నారు. ప్రధానంగా రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, సెల్ నెంబర్ ఇవ్వాలని, దరఖాస్తులో తప్పులుంటే సవరించుకోవాలని తెలిపారు. సొంత ఇల్లు లేకున్నా కిరాయి ఇంట్లో ఉన్నవారు ఈ పథకానికి అర్హులేనని తెలిపారు. వినియోగదారులు అందుబాటులో లేనట్లయితే ఒక పేపర్‌పై రేషన్‌కార్డు నెంబర్, ఆధార్‌కార్డు నెంబర్, సెల్ నెంబర్ రాసి మీటర్ వద్ద ఉంచాలని సూచించారు.

మంత్రి తుమ్మలను కలిసిన కొత్వాల

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 6 : రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మంగళవారం కలిశారు. ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం కొత్వాలను మంత్రి సత్కరించారు. కార్యక్రమంలో పాల్వంచ మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, కందుకూరి రాము, చిరంజీవి పాల్గొన్నారు.

చదువు ద్వారానే అభివృద్ధి

కొణిజర్ల, ఫిబ్రవరి 6: విద్యార్థులు చదువుల్లో రాణించడం ద్వారా తమ జీవితాల్లో అత్యున్నత స్థాయికి చేరుకొని అభివృద్ధి సాధించగలరని వైరా న్యూలిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల అధినేత పోతినేని భూమేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని పల్లిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు డ్రైఫ్రూట్స్, పండ్లను అందజేశారు. హెచ్ఎం కే సుజాత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు ప్రతిభ కనబరిచిన వారికి సహాయం చేసే అవకాశం ఉందని, విద్యార్థులు అలాంటి అవకాశాల్ని వినియోగించుకొని తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుల్జార్‌బేగం, డీవీఎస్ రావు, రమణ, అచ్యుత్, అజీం, సంక్రాంతి రవికుమార్, ఉష, విద్యార్థులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 6: మండలంలోని పెద్దగోపవరం సొసైటీ సభ్యుడిగా ఉన్న ఎర్రమల రమణారెడ్డి ఇటీవల మృతిచెందాడు. ఆయనకు గ్రూప్ ఇన్సూరెన్స్ కింద రూ.50 వేలు మంజూరు కావడంతో అట్టి బీమా చెక్కును మంగళవారం అతని భ